క్లుప్తంగా

పత్తిలో లింగార్షక బుట్టలు వాడాలి



మచవరం: పత్తి పంటలో గులాబి రంగు పురుగు ఉధృతిని తెలుసుకునేందుకు ఎకరాకు నాలుగు నుంచి 8 వరకు లింగార్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని ఏడీఏ బి.శ్రీకృష్ణదేవ రాయలు తెలిపారు. మండలంలోని పిల్లుట్ల గ్రామంలో పత్తి పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగార్షక బుట్టల్లో రెక్కల పురుగులు 8, 10 ఉన్నట్లయితే పురుగు మందు పిచికారి చేసుకోవాలని చెప్పారు. వేప నూనె లేదా వేప గింజల కషాయం పురుగు మందులో కలపాలన్నారు. పోషకాల లోపం నివారణకు ఫార్ములా–4 వాడాలని తెలియజేశారు. ఏఓ కె.రామమ్మ, వ్యవసాయ సహాయకులు నరసింహ నాయక్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ



మాచర్ల రూరల్: సచివాలయ ఉద్యోగులు ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని నిర్ణీత సమయంలో పరిష్కరించి తగు జవాబుదారీతనంగా వ్యవహరించాలని తహసీల్దారు ఎండీ జియా ఉల్ హుక్ అన్నారు. శుక్రవారం కంభంపాడు గ్రామ సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి, మాట్లాడారు. ఉద్యోగులు సమయ పాలన పాటించాలని, ప్రభుత్వం నిర్దేశించిన సమయం ప్రకారం ఆన్‌లైన్‌లో హాజరు నమోదు చేయాలన్నారు. డ్రస్ కోడ్‌ను తప్పని సరిగా పాటించాలని స్పష్టం చేశారు. నిర్లక్ష్యం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆర్ఐ నిమ్మల శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి బిట్టు వెంకటేశ్వర్లు, వీఆర్ఓ షేక్ జలీల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏచూరి మరణం తీరని లోటు



రెంటచింతల: ఉద్యమ నేత సీతారాం ఏచూరి మరణం సీపీఎంకు తీరని లోటని మండల నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సీపీఎం జెండా వద్ద పార్టీ జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్ర పటానికి వారు పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఆయన ఆశయ సాధన కోసం పార్టీ కార్యకర్తలు కృషిచేయాలన్నారు. సీపీఎం మండల కార్యదర్శి తిక్కా నాగేశ్వరరావు, పార్టీ సీనియర్ నాయకులు బుట్టి మరియదాసు, నాయకులు మహంకాళి ప్రకాష్ రావు, తోడిచర్ల ఎలీషా, ఉల్లిందల పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

సుఖ వ్యాధుల నివారణపై అవగాహన

గురజాల : హెచ్ఐవీ/ఎయిడ్స్ సుఖ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని రీడ్స్ ప్రాజెక్టు మేనేజర్ కోమలి సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఓ యువత మీకు తెలుసా కార్యక్రమంలో భాగంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెచ్ఐవీ/ఎయిడ్స్ వ్యాధి నివారణ మార్గాలను వివరించారు. ఈ వ్యాధికి ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఐసీటీసీ కౌన్సిలర్ వెంకయ్య, ఎల్‌టీ కృష్ణ, మౌలాబి, పద్మ, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

గురజాల : స్థానిక కోర్టు భవనాల నందు శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందని మండల న్యాయ సేవాధి కార సంస్థ ఫుల్ అడిషనల్ ఇన్‌చార్జి చైర్మన్, నాలుగవ అదనపు జిల్లా జడ్జి ఆర్.శరత్ బాబు తెలిపారు. రాజీ పడదగిన క్రిమినల్, సివిల్, చెక్ బౌన్స్ కేసులు, కుటుంబ తగాదాలు లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

వినాయక చవితి పూజలు



మాచర్ల: పట్టణంలో వినాయక చవితి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నెహ్రూ నగర్‌లోని భారీ విగ్రహం, చెన్నకేశవ నగర్, పాతూరు, మంచికల్లు కాశిరెడ్డి అపార్ట్ మెంట్‌లో వినాయక విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదానాలు చేశారు.

గణేశ్ లడ్డూ.. రూ.51వేలు

కారెంపూడి: మండలంలోని ఒప్పిచర్ల గ్రామంలో గణేష్ నిమజ్జనోత్సవం శుక్రవారం సాయంత్రం ఘనంగా జరిగింది. ఎర్రపాలెంలోని ఒక బజారులో గణేష్ లడ్డూ ప్రసాదానికి వేలం నిర్వహించగా రూ.51,000లకు పిన్నెల్లి బ్రదర్స్ కైవశం చేసుకున్నారు. లడ్డూ ప్రసాదాన్ని పిన్నెల్లి వెంకటేశ్వర్లు మాస్టారు, అంజయ్య, నారాయణలు గ్రామంలోని భక్తులకు పంచిపెట్టారు.

కారెంపూడిలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

కారెంపూడి: కలెక్టర్ పి.అరుణ్‌బాబు కారెంపూడి జెడ్పీ హైస్కూల్, పీహెచ్‌సీని శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించారు. భోజనం వడ్డింపు విధానం బాగలేదని, డైనింగ్ హాల్లో మంచి నీరు అందుబాటులో ఉంచాలని, పరిసరాలను, మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. 412 విద్యార్థులకు 291 మంది మాత్రమే భోజనం చేశారని, మిగిలిన విద్యార్థులు ఎందుకు చేయడం లేదని హెచ్‌ఎంను ప్రశ్నించారు. హెచ్‌ఎం చెప్పిన కారణాలకు సంతృప్తి చెందని కలెక్టర్ ఒక రోజుకు ఎంత జీతం వస్తుందని ప్రశ్నించారు. నెలకు జీతం ఎంతో చెప్పి, రోజు లెక్క సరిగా చెప్పకపోవడంతో.. జీతం లెక్కే సరిగా చెప్పలేకపోతే విద్యార్థులకు గణితం ఎలా బోధిస్తున్నారని కలెక్టర్ ప్రశ్నించారు. విద్యార్థులు మధ్యాహ్న భోజనం ఎందుకు చేయడం లేదో తల్లిదండ్రులను అడిగి తెలుసుకుని అందరూ వచ్చేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. పాఠశాల పనితీరుపై విచారించి సమగ్ర నివేదిక ఇవ్వాలని డీఎల్‌డీఓ గబ్రూ నాయక్‌ను ఆదేశించారు. అనంతరం పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఆసుపత్రిలో నెలకు మూడు ప్రసవాలు మాత్రమే ఎందుకు జరుగుతున్నాయని డాక్టర్లను కలెక్టర్ ప్రశ్నించారు. నెలకు సగటున 200 కాన్పులు జరుగుతున్నాయని అందులో కనీసం 20 శాతం పీహెచ్‌సీలో జరగాలన్నారు. పనితీరు మెరుగుపరుచుకుని ప్రజల్లో నమ్మకం పెంచుకోవాలని సూచించారు. ఎప్పటికప్పుడు ఇన్ పేషెంట్లు, అవుట్ పేషెంట్ల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, శనివారం కల్లా నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం తహసీల్దారు కార్యాలయాన్ని పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. తహసీల్దారు ప్రసాద్, ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఉపాధిలో ఉద్యాన పంటల సాగు పనులు



నిమ్మ మొక్కలు నాటుతున్న కూలీలు

కారెంపూడి: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మండలంలో ఉద్యాన పంటల పెంపకానికి అధికారులు శుక్రవారం శ్రీకారం చుట్టారు. ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఎంపీడీఓ జి.శ్రీనివాసరెడ్డి, ఏపీఓ కోటిరెడ్డి శుక్రవారం ఉసిరి మొక్కలను నాటారు. ఉద్యాన పంటలు వేయడానికి దరఖాస్తు చేసుకున్న రైతుల పొలాల్లో నిమ్మ, బత్తాయి, మామిడి మొక్కలు నాటే పనులు చేపట్టారు. కారెంపూడిలో దరఖాస్తు చేసుకున్న అందరు రైతులకు పండ్ల తోటల మొక్కలు తెప్పించి నాటుతున్నామని, రెండు రోజుల్లో పనులు పూర్తి అవుతాయని ఎంపీడీఓ తెలిపారు. ప్రభుత్వం ఉద్యాన పంటలు వేయడానికి చేయూత అందిస్తోందని, మొక్కలు ప్రభుత్వమే ఇవ్వడంతో పాటు వాటిని నాటిస్తుందన్నారు. ఎఫ్ఏ బత్తుల బాలరాజు పర్యవేక్షించారు.

పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణ



మాచర్ల: పట్టణంలోని పలు ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు శుక్రవారం దగ్గరుండి శుభ్రం చేయించారు. పారిశుద్ధ్య పర్యవేక్షణాధికారులను ఆయా ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం స్వాధీనం

నాదెండ్ల: రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు దాడి చేసి సుమారు 42 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు సాతులూరు చెరువు సమీపంలో గురువారం అర్ధరాత్రి పోలీసు లు కాపుకాసి అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న టాటా ఏస్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నరసరావుపేట రూరల్ మండలం దొండపాడు గ్రామం నుంచి సాతులూరు మీదుగా నరసరావుపేట వైపు తరలిస్తున్నట్లు గుర్తించారు. పోలీసులను చూసి వాహన డ్రైవర్, వాహనంలోని కూలీలు పరారయ్యారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సచివాలయంలో అందుబాటులో ఉండండి



వినుకొండ(నూజెండ్ల): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గ్రామ రెవెన్యూ అధికారులతో తహసీల్దార్ సురేష్‌నాయక్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ ప్రజలకు సచివాలయంలో అందుబాటులో ఉండాలని, ప్రజలకు రెవెన్యూ సేవలు అందించు విషయంలో ఎటువంటి జాప్యం జరగరాదని తెలియజేశారు. సీసీఆర్‌సీ కార్డులు, పీజీఆర్‌సీ, మీసేవ, సచివాలయ, ఇతర రెవెన్యూ సేవల విషయంపై ఆయన సమీక్షించారు.

తిరుమల కళాశాలలో ప్రాంగణ ఎంపికలు



నరసరావుపేట రూరల్: తిరుమల కళాశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులకు హైదరాబాద్‌కు చెందిన జెన్‌ట్రీ ల్యాబ్స్ సంస్థలో ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.వి.నారాయణ శుక్రవా రం తెలిపారు. ఈనెల 10వ తేదీన జెన్‌ట్రీ ల్యాబ్స్ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులకు రాత పరీక్ష, టెక్నికల్ రౌండ్, హెచ్‌ఆర్ ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలకు ఎంపికైనట్లు వివరించారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను వార్షిక వేతనం రూ.3 లక్షలు ఇస్తారని తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ బొల్లా బ్రహ్మనాయుడు, కార్యదర్శి రావెల సత్యనారాయణ, అధ్యాపకులు అభినందించారు.

గణితశాస్త్రంపై విద్యార్థులకు అవగాహన



నమూనాల ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని వెల్లటూరు రోడ్డులోని గుడ్‌షపర్డ్ స్కూల్లో డాక్టర్ ఇన్నారెడ్డి ఆధ్వర్యంలో గణిత శాస్త్రంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ జీవితంలో గణిత శాస్త్రానికి గల ప్రాముఖ్యతను వివరించారు. గణిత శాస్త్రం ప్రమేయం లేకుండా ఏ శాస్త్రం లేదని తెలిపారు. గణితంపై మక్కువ చూపే విద్యార్థుల భవిష్యత్ బంగారుమయం అవుతుందన్నారు. ఈ సదస్సులో 30 గణిత నమూనాలు ప్రదర్శించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. సులభంగా మేథ్స్ సాధన చేసే పద్ధతులు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.లక్ష్మీ సునీత, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, లక్ష్మణరావు, యశోదరావు, నరసింహారావు, నిర్మల, నాగలక్ష్మి పాల్గొన్నారు.

ఇక నుంచి సొసైటీల్లో ఆన్‌లైన్ సేవలు

కారుమంచి సొసైటీ సీఈవో నారాయణ

శావల్యాపురం: వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లోని (సొసైటీ) రైతులకు ఇక నుంచి డిజిటలైజేషన్ (ఆన్‌లైన్) విధానంలో అన్నీ రకాల సేవలు అందుబాటులో వస్తాయని కారుమంచి సొసైటీ సీఈవో వై.వి.నారాయణ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 2047 సొసైటీ కార్యాలయాలు ఉన్నాయని అక్టోబరు నెలఖారు నాటికి నూరుశాతం ఆన్‌లైన్ విధానంలో ఆర్థిక లావాదేవీలు కొనసాగేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా పైలట్ ప్రాజెక్టులో పల్నాడు జిల్లాలో శావల్యాపురం, ఈపూరు సొసైటీలను ఎంపిక చేయగా ఇప్పటి వరకు 70 శాతం రైతుల సమగ్ర వివరాలతో కూడిన సమాచారం ఆన్‌లైన్ పొందుపరిచినట్లు తెలిపారు. కారుమంచి సొసైటీ పరిధిలో 3351 మంది రైతులు ఉండగా 1548 మంది రైతులు అప్పుదారులుగా ఉన్నట్లు తెలిపారు. రూ.50 కోట్లు నిధులు రైతులకు రుణాల రూపంలో మంజూరు చేయగా, మహిళా సంఘాల్లోని గ్రూపు సభ్యులకు రూ.10 కోట్లు రుణాలను తక్కువ వడ్డీ రేటుకు ఇచ్చినట్లు తెలిపారు. 50 శాతం రైతుల సమగ్ర వివరాలన్నీ ఆన్‌లైన్‌లో నమోదు చేశామన్నారు. సొసైటీల్లోని రైతుల సమగ్ర వివరాలు ఆన్‌లైన్ విధానం చేయటం ద్వారా రుణాలు మంజూరు తదితర సేవల్లో అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా రైతులకు సేవలు అందుతాయన్నారు. అక్టోబరు 2న పైలట్ ప్రాజెక్టులో ఎంపికైన సొసైటీల్లో ఆన్‌లైన్ సేవలు ప్రారంభం అవుతాయన్నారు. మిగిలిన వాటిల్లో కూడా అక్టోబరు నెలఖారులోగా ఆన్‌లైన్ సేవలు నూరుశాతం అందుబాటులోకి వస్తాయని సొసైటీ సీఈవో నారాయణ తెలిపారు.

ఎన్‌సీసీతో క్రమశిక్షణ, దేహదారుఢ్యం

- 23 ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ నాయబ్ సుబేదార్ రేఖారామ్
- ఉత్సాహంగా ఎన్‌సీసీ సెలక్షన్స్



విద్యార్థినులను ఎంపిక చేస్తున్న ఆఫీసర్లు

నరసరావుపేట ఈస్ట్: ఎన్‌సీసీ ద్వారా క్రమశిక్షణ, దేహదారుఢ్యంతో పాటు ఏకాగ్రత పెరుగుతుందని 23 ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ నాయబ్ సుబేదార్ రేఖారామ్ తెలిపారు. ఎన్‌సీసీ ఆఫీసర్ కల్నల్ సునీల్ గౌతమ్ ఆదేశాల మేరకు శుక్రవారం కాసు బ్రహ్మానందరెడ్డి కళాశాలలో ఎన్‌సీసీ సెలక్షన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా రేఖారామ్ మాట్లాడుతూ, పారా మిలటరీ విభాగంగా ఉన్న ఎన్‌సీసీ సర్టిఫికెట్ల ద్వారా విద్య, ఉద్యోగ అవకాశాలలో రిజర్వేషన్ పొందవచ్చని వివరించారు. సమాజానికి తద్వారా దేశానికి సేవ చేసే అవకాశం ఎన్‌సీసీ ద్వారా కలుగుతుందని తెలిపారు. ఎన్‌సీసీ ఎంపికకు 115 మంది బాల బాలికలు హాజరు కాగా వారిలో 75 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. కళాశాల ప్రిన్సిపల్ సి.హెచ్.వి.నాగిరెడ్డి, కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్ మేజర్ వై.అంజిరెడ్డి, బెటాలియన్ హవల్దార్ షంషీర్‌సింగ్ పాల్గొన్నారు.

నరసరావుపేటలో అరుదైన శస్త్ర చికిత్స

మహిళ పేగులో నుంచి గాజు ముక్కల తొలగింపు



నాగలక్ష్మితో డాక్టర్ శ్రీనివాస్

నరసరావుపేట: స్థానిక ప్రకాష్‌నగర్‌లోని శంకుంతల గ్యాస్ట్రోలివర్ కేర్ హాస్పిటల్‌లో గురువారం డాక్టర్ ఐలా శ్రీనివాస్ అరుదైన శస్త్రచికిత్స నిర్వహించారు. ప్రమాదవశాత్తు గాజు ముక్కలు మింగిన రెంటచింతలకు చెందిన నాగలక్ష్మి బుధవారం హాస్పిటల్‌లో చేరారు. ఆమెకు పరీక్షలు చేసిన డాక్టర్ చిన్నపేగులో గాజుముక్కలు ఉన్నట్లుగా గుర్తించి ఎండోస్కోపీ విధానంతో విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించి ఆ గాజుపెంకులను బయటకు తీసినట్లు హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ దత్ శుక్రవారం తెలిపారు. ఆ మహిళ క్షేమంగా ఉన్నారని పేర్కొన్నారు.

మూడుసార్లు బయోమెట్రిక్ తప్పనిసరి



మాట్లాడుతున్న ఎంపీడీవో వెంకటేశ్వరరావు

నరసరావుపేట రూరల్: సచివాలయ సిబ్బంది ప్రతి రోజు మూడుసార్లు బయోమెట్రిక్ హాజరు తప్పని సరిగా వేయాలని ఎంపీడీవో నాగిశెట్టి వెంకటేశ్వర రావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీవో సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న ఎంపీడీవో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సచివాలయ సిబ్బందికి అధికారుల అనుమతి లేకుండా వ్యక్తిగత సెలవులు మంజూరు చేయవద్దని తెలిపారు. గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని, రోడ్ల వెంట ఉన్న వ్యర్థాలను తొలగించాలన్నారు. ఈనెల 17వ తేదీ నుంచి అన్ని గ్రామాల్లో స్వచ్ఛత హి సేవ కార్యక్రమాన్ని వందశాతం అమలు చేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశాల మేరకు రెండవ శనివారం సెలవును రద్దు చేసినట్లు తెలిపారు.

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు మేనేజర్ వలేటి శివకృష్ణ



శావల్యాపురం: వ్యవసాయ పనులు ముమ్మరంగా ఉన్నందున పొలాలకు పెట్టుబడులు నిమిత్తం అర్హత కల్గియున్న స్వయం సహాయక మహిళా గ్రూపులకు రుణాలను మంజూరు చేసినట్లు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు మేనేజర్ వలేటి శివ కృష్ణ తెలిపారు. శుక్రవారం స్థానిక బ్రాంచ్ పరిధిలో మహిళా గ్రూపుల్లోని సభ్యులకు రుణాలు మంజూరు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా బ్రాంచ్ మేనేజరు మాట్లాడుతూ మహిళలు ఆర్థిక ప్రగతి సాధించటానికి ఈ రుణాలు ఎంతో దోహదపడతాయన్నారు. రుణాలు సకాంలో చెల్లింపులు చేసిన మహిళా సభ్యులకు వడ్డీ రాయితీ వర్తిస్తుందన్నారు. అనంతరం మండలంలోని కనమర్లపూడి గ్రామంలోని ఒక్కొక్క గ్రూపునకు రూ. 20 లక్షల చొప్పున ఐదు గ్రూపులకు రూ. కోటి రూపాయలు రుణాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ దిలీప్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కేజీబీవీలో పరిశుభ్రతపై విచారణ

రెంటచింతల: కస్తూర్బా గాంధీ పాఠశాలలో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని గురజాల ఆర్డీవో జీవీ రమణకాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మిట్టగుడిపాడు గ్రామ శివారులోని కస్తూర్బా గాంధీ విద్యాలయంను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థినులను ఎలుకలు కరిచిన ఘటనతో పాటు పాఠశాలలో నెలకున్న సమస్యలను ప్రిన్సిపల్ రాజకుమారి తహసీల్దార్ కె.కరుణ కుమార్‌కు వివరించారు. ఈ విషయాన్ని వెంటనే జిల్లా కలెక్టర్ బి.అరుణ్‌బాబు దృష్టికి తీసుకువెళ్లారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గురజాల ఆర్డీవో అడిషనల్ డీఎంహెచ్‌వో పద్మావతితో కలిసి పాఠశాలను సందర్శించారు. ఎలుకలు కరిచినట్లు భావించిన 14 మంది విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వారిలో ఆరుగురుని ఎలుకలు గీరినట్లు నిర్ధారించారు. పాఠశాలలోని క్యాంటిన్, ఆర్వో ప్లాంట్, భోజన శాల, విద్యార్థినుల వసతి గృహం, తరగతి గదులను పరిశీలించి ఎందుకు పరిశుభ్రంగా లేవని ప్రిన్సిపల్ రాజకుమారిని ప్రశ్నించారు. పనులు చేపట్టేందుకు నిధుల కొరత ఉందని, తమకు వేతనాలు కూడా సకాలంలో రాకపోవడం వల్ల పనులు చేపట్టలేకపోతున్నామని వివరించారు. అనంతరం ఆర్డీవో ఒక్కో విద్యార్థినిని విచారించి వివరాలను సేకరించారు. సమస్యల గురించి తెలుసుకున్నారు. సర్పంచ్ గొట్టం ప్రమీల గురువారెడ్డి ఆధ్వర్యంలో పాఠశాల పరిసరాల్లో పిచ్చి మొక్కలు పొక్లెయినర్‌తో తొలగించారు. తహసీల్దార్ కె.కరుణకుమార్, ఎంఈవో –2 వై.శివనాగేశ్వరరావు, ఆర్ఐ దాసరి కాంతారావు, వీఆర్వో బి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ జ్యోతి, కార్యదర్శి సుజాత

మాచర్ల రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారంతో పాటు సులభ రీతిలో విద్యాబోధన ఉంటుందని అంగన్ వాడీ సూపర్‌వైజర్ జ్యోతి, పంచాయతీ కార్యదర్శి సుజాత తెలిపారు. శుక్రవారం జమ్మలమడక అంగన్‌వాడీ కేంద్రంలో ప్రభుత్వ పథకాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రీ స్కూల్ యాక్టివిటీని సద్వినియోగం చేసుకునేందుకు తమ చిన్నారులను కేంద్రాల్లో చేర్చాలని కోరారు. మహిళల రక్షణ చట్టాలను కార్యదర్శి సుజాత వివరించారు. అంగన్‌వాడీ టీచర్స్ జి.మల్లేశ్వరి, నాగేంద్రం, ఆశ వర్కర్లు, ఆయాలున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పిడుగురాళ్ల: పట్టణంలో శనివారం విద్యుత్‌కు అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ ఆరికట్ల శివనాగిరెడ్డి తెలిపారు. కొండమోడు సబ్ స్టేషన్ పరిధిలో న్యూ బైపాస్, మహవీర్ నగర్ సబ్ స్టేషన్ల పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేసన్, చెరువు కట్ట, కళ్లం టౌన్‌షిప్, పిల్లుట్ల రోడ్డు, ఇందిరమ్మ కాలనీ, పిడుగురాళ్ల మెయిన్ రోడ్డు, పోలీస్ స్టేషన్, తహసీల్దార్ కార్యాలయం ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని తెలిపారు.

గురజాల : స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గురజాల, పులిపాడు, మాడుగుల, చర్లగుడిపాడు, జంగమహేశ్వరపురంలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఏఈ మస్తాన్‌వలి తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

మాచర్ల: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పలు చోట్ల విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎ.రామయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మాచర్ల పట్టణం, రూరల్, దుర్గి, వెల్దుర్తి మండలాల్లోని అన్ని గ్రామాలలో అంతరాయం ఉంటుందని పేర్కన్నారు.

కారెంపూడి: మండలంలో శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ కె.కోటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రజా పోరాట యోధుడు సీతారాం ఏచూరి

- సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సంతాప సభ
- సీతారాం మృతి కమ్యూనిస్టు ఉద్యమాలకు తీరని లోటు



నివాళులు అర్పిస్తున్న సీపీఎం నాయకులు

నరసరావుపేట: ప్రజా పోరాట యోధుడు కామ్రేడ్ సీతారాం ఏచూరి అని, ఆయన అకాల మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ అన్నారు. స్థానిక కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్ర ప్రాంగణంలో శుక్రవారం సాయంత్రం ఏచూరి సంతాపసభ నిర్వహించారు. సీనియర్ నాయకులు కామినేని రామారావు అధ్యక్షత వహించగా, మరో సీనియర్ నాయకులు ఏవీకే దుర్గారావు ఏచూరి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విజయకుమార్ మాట్లాడుతూ పార్టీ నాయకునిగా ఉమ్మడి ఆంధ్రరాష్ట్రంలో జరిగిన అనేక ప్రజా ఉద్యమాల్లో, బహిరంగ సభల్లో పాల్గొని కార్యకర్తలలో వామపక్షభావాలను రేకెత్తించి ఉత్తేజ పరిచి ఉద్యమాలకు దిశా నిర్దేశం చేశారన్నారు. సంతాప సభలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏపూరి గోపాలరావు, జిల్లా కమిటీ సభ్యులు డి.శివకుమారి పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అడ్డుకున్న అధికారులు



వంకాయలపాడులో వధువు తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న అధికారులు

నాదెండ్ల: యడ్లపాడు మండలం వంకాయలపాడు, ఉప్పరపాలెం గ్రామాల్లో బాల్య వివాహాలు జరుగుతున్నాయన్న సమాచారంతో అధికారులు వెళ్లి వివాహాలను నిలుపుదల చేయించారు. మండల ప్రత్యేకాధికారి సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ విజయశ్రీ, ఎంపీడీవో హనుమారెడ్డి, ఎస్సై బాలకృష్ణ, ఈవోపీఆర్డీ వరూదిని, ఆర్ఐ చక్రవర్తి, ఏవో సాయి శ్రీనివాస్, ఐసీడీఎస్ అధికారులు ఆయా గ్రామాలకు వెళ్లారు. వధువు తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. బాల్య వివాహాల వల్ల ఎదురయ్యే దుష్ప్రభావాలను వివరించారు. మైనార్టీ తీరాకే వివాహాలు చేయాలన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు.

లింగారావుపాలెంలో హిందీ దినోత్సవం



హిందీ దివస్ ఆకారంలో విద్యార్థులు

నాదెండ్ల: యడ్లపాడు మండలం లింగారావుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం హిందీ దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం కె.వి. రామిరెడ్డి మాట్లాడుతూ హిందీ జాతీయ భాష అని, దేశ సమైక్యతకు హిందీ భాష దోహదపడుతుందన్నారు. ప్రపంచంలో అత్యధికులు మాట్లాడే భాషల్లో హిందీ ఒకటన్నారు. భారతదేశంలో వందలాది భాషలున్నాయని, అయితే జాతీయ భాషగా హిందీ దేశ ప్రజలందరి మాధ్యమంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ హిందీని ఆదరించాలన్నారు. అనంతరం హిందీ దివస్ ఆకారంలో విద్యార్థులు నిల్చుని ప్రదర్శించారు. కార్యక్రమంలో హిందీ ఉపాధ్యాయులు కిరణ్‌కుమార్, ఉపాధ్యాయులు రామాంజనేయులు, శ్రీనివాసరావు, విజయ్ శామ్యూల్, శైలజ, మేరిశౌరీలు, గ్రామ పెద్దలు ఎన్ శివ రామకృష్ణయ్య, టి సత్యనారాయణ ఉన్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు

వినుకొండ: బొల్లాపల్లి మండలం గండిగనుమల తండాకు చెందిన రవినాయక్ హత్య కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం వినుకొండ రూరల్ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 6న బొల్లాపల్లి మండలం బ్రిడ్జితండాకు చెందిన రవినాయక్‌ను హత్య చేసి సాగర్ కెనాల్‌లో పడేసినట్లు పోలీసుల విచారణలో తేలిందన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి, నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు వెల్లడించారు.